AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com



అటవీ భూముల ఆక్రమణపై ఉక్కుపాదం.. 2






విద్యావైద్యం అందరికీ అందుబాటులోకి 2

## ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా స్వామి యాదవ్



**అక్షరటుడే, ఇందూరు:** బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా స్వామి యాదవ్ నియమితులయ్యారు. నాంపల్లి లోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్ గౌడ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన కార్యవర్గ జాబితాలో వివిధ జిల్లాలకు చెందిన నాయకులకు బాధ్యతలు కేటాయించారు. స్వామి యాదవ్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నాయకత్వం అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.




## స్మైల్స్ పాఠశాలలో ఘనంగా బోనాలు..

**అక్షర టుడే ఆర్మూర్:** పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్ పాఠశాలలో శనివారం బోనాల కార్యక్రమానికి నిర్వహించారు. బోనాల సందర్భంగా విద్యార్థులు పోతురాజుల వేషధారణలో, విద్యార్థి లు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను ఎత్తుకొని అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ షబానా గౌహర్, పాఠశాల డైరెక్టర్ రఫీ గౌహర్, ఉపాధ్యాయులు సింధూర, స్వప్న, ఆఫియా, శ్రావణి, స్పందన, సుజాత, మానస, గాయత్రి, నవ్య శ్రీ, హారిక, లావణ్య, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.






# బల్దియాలో ప్రైవేట్ వ్యక్తుల హవా!

కామారెడ్డి మున్సిపాలిటీ మరో వివాదానికి కేంద్రంగా మారింది. బల్దియాలో పలువురు ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలో అధికారులు స్వతంత్రంగా పని చేయలేకపోతున్నారని ఇటీవల ప్రచారం జోరుగా సాగుతోంది. సదరు వ్యక్తులు ఆఫీసులోకి వెళ్లగానే అధికారులు సైతం సలాం కొట్టేలా అజమాయిషీ చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

■ అధికారులపై అజమాయిషీకి యత్నం ■ ప్రతి శాఖలో పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపణలు ■ అడిషనల్ కలెక్టర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఫిర్యాదు

బల్దియాలోని ఇంజినీరింగ్, ఆరోగ్యం, వాటర్ వర్క్స్, రెవెన్యూ ఇలా ప్రతి శాఖలోనూ ప్రైవేట్ వ్యక్తుల ప్రభావం ఉందని ప్రచారం సాగుతోంది. కాంట్రాక్టర్ల ఎంపిక నుంచి రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్ల పనుల వరకు అంతా వారి సిఫార్సుల మేరకే జరుగుతోందని తెలుస్తోంది. ఇలా అయితే ప్రజలు ఓటేస్తే గెలిచిన మా పరిస్థితి ఏమిటన్న ప్రశ్న కౌన్సిలర్ల నుంచి వస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు తిష్ట వేశారని వారు ఆరోపించారు. అన్ని పనుల్లో వారు తలదూరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆరోపణలపై ముఖ్య నేతలు ఇంకా స్పందించలేదు.



### ప్రజాప్రతినిధులు దృష్టి సారించేనా

కామారెడ్డి మున్సిపాలిటీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో అధికార పార్టీకి బహిరంగ మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్ ప్రస్తుతం ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ఫిర్యాదు చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వరుస వివాదాలపై ముఖ్య నాయకులు దృష్టి సారిస్తారా..? అందరిని ఏకతాటిపైకి తీసుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తారా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



## రోడ్డుపై నీళ్లలో కూర్చుని బీఆర్ఎస్ కౌన్సిలర్ నిరసన

**అక్షరటుడే, కామారెడ్డి :** పట్టణంలోని ప్రధాన రోడ్డుపై వర్షం నీళ్లలో కూర్చుని బీఆర్ఎస్ నాయకుడు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిపై పోలీస్ స్టేషన్ ముందు రైల్వే బ్రిడ్జి దిగే సమయంలో కుంటను తలపించేలా రోడ్డుపై నీళ్లు నిలిచి ఉన్నాయని.. నిత్యం ఇదే దారిలో తిరిగే ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి చూడడం లేదని బీఆర్ఎస్ 47వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ వాపోయారు. పట్టణంలోని రైల్వే కమాన్ మీదుగా పాత బస్టాండ్ వెళ్లే దారిలో కమాన్ కింద వర్షం పడితే నీరు భారీగా నిలిచిపోతుందన్నారు. అధికారులు పరిష్కార మార్గం చూపడంలో విఫలం అవుతున్నారని.. నీటి నిల్వతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతూ ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోవడంతో భారీగా రోడ్డుపై నిలిచిపోయిన నీటిలో కూర్చుని నిరసన తెలుపుతున్నానన్నారు. అధికారులు స్పందించి పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు.

## రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు సమష్టిగా కృషి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేద్దామని ఎమ్మెల్యేలు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు, కౌలాస్ నాలా, పోచారం, రామడుగు తదితర జలాశయాల్లో నీటి నిల్వల స్థితిగతులు, ఆయకట్టు పంటలకు సాగు నీటిని అందించే వెసులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా ఉండేదుకు ఈ ఏడాది ముందుగానే నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. ఇటీవల తుపాన్ ప్రభావంతో కొంతవరకు వర్షాలు కురిసినప్పటికీ, ఎల్‌నినో కారణంగా ఆగస్ట్, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పాల్గొన్నారు.

## డ్రగ్స్, అక్రమ మద్యం సరఫరాపై కేసులు నమోదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రగ్స్, అక్రమ మద్యం సరఫరాపై కఠినంగా వ్యవహరిస్తున్నామని పలు కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు పీపీఈవో నిజామాబాద్ పరిధిలోని వివిధ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, స్వాధీనం చేసుకున్న పదార్థాలు, పట్టుబడిన నిందితుల వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో పరిధిలో ఇప్పటి వరకు 22 కల్లు శాంపిళ్లు తీసుకుని ల్యాబ్‌కు పంపామని.. అలాగే 22 మందిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. కల్తీ కల్లును అక్రమంగా రవాణా చేస్తున్న 34 ఘటనల్లో 29మందిని అరెస్ట్ చేశామని.. స్పాట్‌లోనే 2,014 లీటర్ల కల్లును పారబోసి, శాంపిల్స్ సేకరించామని వివరించారు. 12 గంజాయి కేసులు నమోదు చేసి 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వారు వివరించారు. ఈ కేసుల్లో 21 మందిని అరెస్ట్ చేయడమే కాకుండా, రవాణాకు ఉపయోగించిన 4 వాహనాలు, 14 మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే ఆర్మూర్ పరిధిలో 11 కల్తీ కల్లు అక్రమ సరఫరా కేసులు, బోధన్ పరిధిలో 89 అక్రమ కల్తీకేసులు నమోదు చేసి 19మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లా కల్తీ కల్లు, గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామని వివరించారు. కల్తీ కల్లు తయారు చేయొద్దని హెచ్చరించారు.

## షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ కూల్చివేత..



**అక్షరటుడే, కామారెడ్డి :** నార్సింగి మండలం జాప్తి శివనూరు గ్రామంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి చెందిన ఫార్మ్ హౌస్ ప్రహరీపై ఆ గ్రామస్థులు దాడి చేశారు. తమ పంట పొలాలకు వెళ్లకుండా దారిలో ఫార్మ్ హౌస్ ప్రహరీని కట్టారని ఆరోపిస్తూ గ్రామస్థులు కాంపౌండ్ గోడను కూల్చివేశారు. ఈ విషయాన్ని పలు మార్లు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లినప్పటికి స్పందించలేదని గ్రామస్థులు ఆరోపించారు. తమ పొలాల్లోకి వెళ్లే దారి లేక, షబ్బీర్ అలీ నుంచి స్పందన రాకపోవడంతో కాంపౌండ్ కూల్చివేశామన్నారు. ఇకనైనా తమ పొలాల్లోకి దారి ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటన పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల వరుస వివాదాలు షబ్బీర్ అలీని చుట్టుముడుతుండగా తాజాగా ఈ ఘటన ఎటువైపు దారి తీస్తుందోనన్న చర్చ సాగుతోంది. అయితే కాంపౌండ్ కూల్చివేసిన ఘటనపై ఇప్పటి వరకు షబ్బీర్ అలీ స్పందించలేదు. దీనిపై ఆయన ఎలా స్పందిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## ఎస్సారెస్పీలో జాలర్లకు చిక్కిన భారీ తాబేలు



**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువ పరిధిలో మత్స్యకారుల వలకు భారీ తాబేలు చిక్కింది. రోజువారీగా చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు శనివారం కాలువలో వల వేయగా, సుమారు 20 కిలోల బరువు ఉన్న తాబేలు చిక్కింది. తాబేలు కనిపించడంతో మత్స్యకారులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని తాబేలును మత్స్యకారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## గ్రామ అధ్యక్షుల నియామకం



**అక్షరటుడే, మాక్లూర్:** కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాల్లో నూతన గ్రామ అధ్యక్షులను నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రావు అధ్యక్షతన ఆయా గ్రామ కార్యకర్తల సమావేశంలో ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు. రాంపూర్ కిరణ్, మెట్టు గ్రామానికి అనిల్, వెంకటాపూర్ సతీష్, గంగారమంద గోపాల్ సాయిలు, బొంకంపల్లి అక్బర్, వేనుకిషన్ నగర్ తండాకు సురేష్, ముల్లంగి పాషాను నూతన అధ్యక్షులుగా ఎన్నికైనట్లు దయాకర్ ప్రకటించారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్ గౌడ్, వెంకటేశ్వర రావు, అశోక్ పాల్గొన్నారు.

## శతచండీ యాగంతో ఇందూరు పావనం



**అక్షరటుడే, ఇందూరు:** శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కల్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్‌నినో పరిస్థితులను అధిగమించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటుందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే 'సర్వే జన సుఖినో భవంతు' అని అంటారని, అందరికోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.





## బురదలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు కష్టాలు

**అక్షరటుడే, కామారెడ్డి :** ఆర్టీసీ బస్సు బురదలో దిగబడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కామారెడ్డి నుంచి అన్నారం వెళ్లే దారిలో రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి వర్షాల నేపథ్యంలో ప్రమాదకరంగా మారింది. ఆ దారిలో బైకులు మినహా భారీ వాహనాలకు పోలీసులు అనుమతించడం లేదు. దాంతో పోసానిపేట, అడ్లూర్ గ్రామాల మీదుగా 10 కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత నెల 29 న గిద్ద వెళ్లాల్సిన బస్సు అడ్లూర్ రోడ్డులో రోడ్డు పక్కన బురదలో ఇరుక్కుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో అన్నారం వెళ్లే బస్సు బురదలో ఇరుక్కోగా కండక్టర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మొదటిసారి బస్సు దిగబడినప్పుడే రోడ్డు బాగు చేయాలని ప్రయాణికులు మొరపెట్టుకున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇవాళ మరొక బస్సు దిగబడాల్సిన పరిస్థితి నెలకొంది. రామారెడ్డి గంగమ్మ వాగుపై రోడ్డు వేసి దారిని పునరుద్ధరించాలని, మట్టి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బోధన్ వంద స్తంభాల గుడిని పునరుద్ధరించాలి



**అక్షరటుడే, బోధన్ :** చారిత్రాత్మకమైన బోధన్ ఇంద్ర నారాయణ స్వామి ఆలయం (వంద స్తంభాల గుడి)ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఛత్రపతి యువజన సంఘం అధ్యక్షుడు,న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బోధన్ పట్టణంలో శనివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆలయంలో భక్తులకు పూజలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఇంద్ర నారాయణ స్వామి ఆలయాన్ని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించిన పురాతన శిల్పకళ, శిలా సంపద, నిర్మాణ అవశేషాలను సంరక్షించి, ఆలయాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆలయానికి 1 ఎకరం 20 గుంటల విస్తీర్ణం ఉన్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి, అశోక్ గౌడ్, గోపి కిషన్, రాజులదేవి పవన్, పెర్కా వెంకటేష్, కందికట్ల వాసు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## జలాల్‌పూర్ శ్రీరంగనాథ స్వామి ఆలయంలో పూజలు



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. నూతనంగా నిర్మించిన పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామివారిని ఊరేగించారు. అనంతరం నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన పల్లకీని దేవస్థానానికి దాత జక్క నరసారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయండి




**అక్షరటుడే, మాక్లూర్:** సారంగాపూర్ చెరుకు ఫ్యాక్టరీని తక్షణమే తెరిచి ఉత్పత్తిని ప్రారంభించాలని చెరుకు ఉత్పత్తి దారుల సంఘం జిల్లా నాయకులు ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. బోర్గాం గ్రామంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఆరుతడి పంట అయిన చెరకును సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో నాలుగు శాసనసభ స్థానాల్లో 117గ్రామాల రైతులు చెరకును పండించేవారని అన్నారు.16ఏళ్లుగా మూతపడిన ఫ్యాక్టరీని ఇప్పటివరకు ప్రభుత్వాలు హామీ ఇవ్వడం తప్ప ఆచరించింది లేదని ఆరోపించారు. ప్రస్తుత, గత పరిస్థితులను ప్రభుత్వానికి విన్నవించి ఫ్యాక్టరీని తెరిపించే దిశగా ప్రత్యేక సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల సారంగాపూర్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేల్పూరు భూమయ్య, దేశెట్టి సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఆ శాఖ అధికారులు సమష్టిగా ముందుకు సాగుతున్నారు. పచ్చని అడవిని సాగుకోసం అక్రమంగా దున్నుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గాంధారి మండలంలో ఫారెస్ట్ రేంజ్ పరిధిలో యంత్రాంగం అక్రమార్కులపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది.**

**– అక్షరటుడే, గాంధారి**

# అటవీ భూముల ఆక్రమణపై ఉక్కుపాదం..



■ అక్కమార్కుల పనిపడుతున్న అధికారులు ■ 23 ట్రాక్టర్లు సీజ్.. ■ కబ్జా చెర నుంచి 500 ఎకరాల భూమి స్వాధీనం


గాంధారి మండల పరిధిలోని 45 గ్రామ పంచాయతీల పరిధిలో 20 ఫారెస్ట్ బీట్లు ఉన్నాయి. అటవీ భూములను అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్న ప్రదేశాలపై అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. అడవులు రూపురేఖలు మారుస్తున్నారు. ఇందులో భాగంగా దాదాపు 150 ఎకరాల్లో సరిహద్దు ట్రెంచ్‌లు (అగడ్తలు) తవ్వించారు. మిగతా భూముల్లోని ఆక్రమణలను తొలగించి, మొత్తం 500 ఎకరాల అటవీ భూమిని తిరిగి శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు.

### కేసుల నమోదు

అటవీ భూములను ఆక్రమించడానికి ప్రయత్నించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన 23 ట్రాక్టర్లలో కొన్నింటిని కోర్టు జరిమానాలు చెల్లించిన అనంతరం విడుదల చేయగా, మిగిలిన వాటిపై కేసులు నమోదు చేసి ఫారెస్ట్ కార్యాలయంలోనే ఉంచారు. అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై ఉపేక్షించేది లేదని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### ప్రజల్లో విస్తృత అవగాహన

మండలంలోని వివిధ గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు పడతాయని గ్రామస్తులకు వివరించారు. అడవులను పెంచాల్సింది పోయి..వాటిని నరుకుతూ సాగు చేయడం ఎంతమాత్రం సరైంది కాదని పేర్కొంటున్నారు. అడవు నరికివేతతో వర్షాభావం పరిస్థితులు తలెత్తుతాయని వివరిస్తున్నారు.



### సిబ్బంది కొరత ఉన్నా సమష్టి కృషితో..



మండలంలో 20 బీట్లకు గాను కేవలం 10 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత వేధిస్తున్నప్పటికీ, అటవీ శాఖ సిబ్బంది అంతా ఒక బృందంగా కలిసికట్టుగా అడవిని కాపాడుతున్నాం. పూర్తిస్థాయి సిబ్బంది నియామకంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలు కూడా అడవుల సంరక్షణకు సహకరించాలి.

**– రమేష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, గాంధారి**

## ముప్కాల్ కేజీబీవీలో వైద్య శిబిరం



**అక్షరటుడే, ముప్కాల్:** పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కేజీబీవీ ముప్కాల్ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యుడు మద్దుల రాకేష్ విద్యార్థినులను పరీక్షించి జ్వరం, జలుబు, చర్మవ్యాధులు, రక్తహీనత (అనీమియా) వంటి ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే రక్తహీనత నివారణకు సమతుల్య పోషకాహారం, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ వినోద, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు భూదేవి, మమత, ఆశాకార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోటి జాతీయ పతాకాలను ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ప్రతి గ్రామం, వార్డులో అధికారులు ఇంటింటికి వెళ్లి జెండాలను అందజేస్తున్నారు. ఎల్లారెడ్డిలోని పాఠశాలల్లో ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. ఇళ్లపై జాతీయ పతాకం ఎగురవేయాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టు 10న మండల స్థాయి యాత్ర, ఆగస్టు 13,14న పెద్దఎత్తున పతాకాల పంపిణీ ఉంటుందని పార్టీ నేతలు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని బీజేపీ నాయకుడు బాలకిషన్ కోరారు.

## విద్యావైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలి




అక్షరటుడే, బాన్సువాడ: దేశంలోని ప్రతి ఒక్కరికీ మెరుగైన విద్యావైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మ అంబేద్కర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి పౌరుడికి కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య, వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి యువకుడికి ఉపాధి కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ వారు సాధించుకున్న కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని, అవినీతి, కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే పాలనను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని పశ్య పద్మ కోరారు. కార్యక్రమంలో సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుబాస్ రాములు, డి. శంకర్, శ్రీనివాస్, గంగాధర్, ఎల్లయ్య, అబ్రహం, సర్దార్, అశోక్ గౌడ్, శివాజీ, అడబల్లి రాజు, పోశెట్టి, మాధవరావు, బసవంతరావు తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ పరిధిలో ఏబీసీ స్విచ్‌ల ఏర్పాటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని ఆజాంబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నసాగర్, వెల్లుట్ల, వెల్లుట్లపేట, ఆజాంబాద్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపర్చే లక్ష్యంతో విద్యుత్‌శాఖ అధికారులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం 11 కేవీ ఏబీసీ స్విచ్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు గ్రామాలకు ఆరు ఏబీసీ స్విచ్‌లను అమర్చారు. ఈ స్విచ్‌ల ఏర్పాటుతో ఒక ఫీడర్‌లో సాంకేతిక లోపం లేదా మరమ్మతులు అవసరమైనప్పుడు ఇతర ఫీడర్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిరంతరంగా విద్యుత్ అందించే అవకాశం ఏర్పడింది. ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు, లోపాలను త్వరితగతిన గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడంలో ఈ చర్య కీలకంగా ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నాసగర్ సర్పంచ్ స్రవంతి సాయాగౌడ్, ఏఈ వెంకటస్వామి, లైన్‌మెన్ కాశీరాం, జేఎల్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

## వర్నిలో ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, బాన్సువాడ:** జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎంపీ సురేష్ షెట్కార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ కూనీపూర్ రాజారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబు, డీసీసీ కార్యదర్శి వెలగపూడి గోపాల్, మాజీ సొసైటీ ఛైర్మన్ నేమాని వీర్రాజు, సర్పంచ్ రవి, సొసైటీ ఛైర్మన్ సాయిబాబు, మహమ్మద్ బారీ, రంజ్యా నాయక్, కలాల్ గిరి, నేమాని రఘు, ఆనంద్, సాయులు, గంగ ప్రసాద్, సాయులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ సేవలను విస్తృతపర్చాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లయన్స్ క్లబ్‌లు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు నూతన సభ్యులను చేర్పించి లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి. బసవేశ్వరరావు సూచించారు. . నగరంలోని వినాయక్ నగర్ సందీప్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ గవర్నర్ పి. బసవేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు నిస్వార్థంగా సేవలందిస్తున్నాయని, స్థానికంగా కూడా ప్రజోపయోగ కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి. రాఘవేందర్, చింతల గంగాదాస్, కోశాధికారిగా అంకం రాజేందర్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లు డి. పెంటయ్య, ఇరుకుల వీరేశం, జిల్లా అడిషనల్ క్యాబినెట్ ట్రెజరర్ పి.లక్ష్మినారాయణ, జిల్లా కార్యదర్శి డి. యాదగిరి, రీజియన్ ఛైర్మన్ పి. హన్మాండ్లు, రీజియన్ కార్యదర్శి నాగేశ్వరరావు, జోన్ ఛైర్మన్లు అబ్బాయి లింబాద్రి, హీరమల్ల విష్ణువర్ధన్, అందె శివాజి, ప్రోగ్రామ్ ఛైర్మన్ ఇరుమల శివలింగం తదితరులు పాల్గొన్నారు.